


# అంతర్గతం

**నిజానికి తన చోటు అది. అక్కడ ఆమె ప్రవేశించింది. ఇవాళ తన్ను వెతుక్కుంటూ వచ్చింది. తన మనసులో మెదిలింది బాధా, లేక నిరాశా, లేక ...?**

'సైభాస్వ'

పైకి వెళ్లటానికి సిద్ధంగా ఉన్న లిఫ్టులో హడావిడిగా ప్రవేశించింది మాధవి.

లిఫ్ట్ బాయ్ తలుపు మూసి బటన్ నొక్కాడు. "థర్డ్ ఫ్లోర్" అంటూ ఎదురుగా నిలబడిన వ్యక్తిని చూసి ఆశ్చర్యపోయింది.

ఆ వ్యక్తి కూడా తనవైపు అలాగే ఆశ్చర్యంగా చూస్తుండటం మాధవి దృష్టినించి తప్పుకోలేకపోయింది. అంతేకాక ఆ కళ్లలో ఆశ్చర్యంతో పాటుగా వెలిగిన ఒక రకమైన మెరుపును కూడా ఆమె స్పష్టంగా చూడగలిగింది. చప్పున చూపు మరల్చుకుంది.


ఆమె కళ్లు పక్కనున్న స్త్రీవైపు తిరిగాయి. ఆవిడకీ దాదాపు తన వయసే ఉంటుంది - ఒక సంవత్సరం అటూ ఇటూగా. లిఫ్ట్ ఆగిన వెంటనే వడివడిగా తన రూమ్‌కు వెళ్లి ఒక గ్లాసు మంచినీళ్లు తాగేదాకా మాధవి స్తిమిత పడలేకపోయింది. తనలో ఎందు కీ తత్తరపాటు అని ప్రశ్నించుకోకుండా ఉండలేకపోయింది.

దగ్గర దగ్గర ఇరవై సంవత్సరాలు గడిచిపోయాయి అతణ్ణి చూసి. ఇన్నేళ్ల తరువాత తామిద్దరూ అంత ఎదురుపడవలసి వస్తుందని కాని, అతన్ని చూడటం వలన తనలో ఇంత అలజడి చెలరేగుతుందని కాని తాను ఎప్పుడూ ఊహించలేదు. అస లెందు కీ అలజడి? అంటే తనింకా గతాన్ని పూర్తిగా విస్మరించలే దన్నమాట! జరిగిన దంతా మరిచిపోయాననే భ్రమలోనే ఉండిపోయిందా తా నిన్నాళ్లూ? ఆనాటి సంఘటనలను, ఆ వ్యక్తిని మరచిపోవడానికి ఎంతో కష్టపడింది. ఎంతో అశాంతిపా.లైంది. అతడిని మర్చిపోలేనందుకు తను పడిన ఆవేదన ఎవరికీ చెప్పుకోలేనిది. ఆ సంఘటన ప్రభావం ఇన్నేళ్ల తర్వాత కూడా అంతగా తనమీద ఉండగలదని

అప్పుడూ ఇప్పుడూ తను అనుకోలేకపోయింది. అదే ఆశ్చర్యంగా ఉంది.

జీవితంలో తగిలిన తాకిడులకు, మార్పులకు తను చాలా రాటుదేలి పోయింది. ప్రపంచం అత్యంత సుందరంగా, మధురంగా కనిపించే తొలి దశలోని అనుభవాలు, అనుభూతులు ఇప్పుడు జీవనవాహినిలో బిందువుల్లా, మెరుపుల్లా, కొన్ని సంఘటనలు మరకల్లా కనిపిస్తున్నాయి. ఈ జీవన యాత్రలో బిందువులా మెరిసి అదృశ్యమైపోయిన ఆ గతస్మృతి చెరిగిపోయిందనే అనుకుంది. అదంతా భ్రమేనని ఈ క్షణం అర్థమైంది. చెప్పలేని భావ మేదో మాధవిని చుట్టుముట్టింది. కళ్లనైతే గట్టిగా మూసుకోగలిగింది గాని, మనసులో చెలరేగే ఆలోచనా తరంగాలను ఆపటం మాత్రం ఆమెకి సాధ్యం కాలేదు.

ఆ రోజు - రోజు కన్నా వేరైన సందడేదో ఇంట్లో




కనిపిస్తోంది. అమ్మ, నాన్న టెన్షన్‌లో ఉన్నట్టుగా ఉన్నారు. ఇల్లంతా సర్దేస్తున్నారు. ఊళ్లో ఉన్న పెద్దమ్మ, పెదనాన్నగారు వచ్చారు. ఊర్నించి వచ్చిన మామయ్య రైలు ఆలస్యంగా వచ్చిందని తెగ చికాకు పడిపోతున్నాడు. అందరూ చేరి ఏవో సంప్రదింపులు, చర్చలు చేసేస్తూ హడావిడి పడిపోతున్నారు.

మాధవికి అంతా కొత్తగా, అయోమయంగా ఉంది. స్నానానికని వెళ్లబోతుంటే పెద్దమ్మ తలమీద నూనె అంటి దీవించి "శుభ్రంగా ఒళ్లు నలుచుకుని తలంటుకుని రావే!" అంది.

"ఎందు"కనే ప్రశ్న రాకముందే ఆవిడ హడావిడిగా వెళ్లిపోయింది.

స్నానం చేసి వచ్చాక అమ్మ, పెద్దమ్మ కలిసి తనని కూర్చోబెట్టి, బారెడు జుట్టూ దులిపి, చిక్కుతీసి, సాంబ్రాణి పొగ వేశారు. జాగ్రత్తగా దువ్వి జడ వేస్తూ పెద్దమ్మ "ఈ తలకట్టే చాలు చూసేవాడికి కళ్లు చెదిరిపోవటానికి - నీ కూతురి కేం తక్కువే, రుక్మిణీ? తెల్లగా లేదని ఎవరో అనుకుంటే మాత్రం నీ కెందుకు భయం" అంది.

అప్పుడే ఈ ప్రత్యేకత ఏదో తనకు సంబంధించినదే అని అనుమానం వచ్చింది మాధవికి. పెద్దవాళ్లిద్దరూ కలిసి అసలు విషయం బయట పెట్టారు.

"మావయ్య మన సంగతి, వాళ్ల సంగతి పూర్తిగా తెలిసినవాడు కావటంచేత ఈ సంబంధం బాగుందని చెప్పాడు. అబ్బాయి ఎక్కడో డామ్ దగ్గర ఇంజనీరు. వాళ్లు ఇవాళ సాయంకాలం పెళ్లి చూపులకు వస్తారు. వాళ్లడిగిన వాటికి జాగ్రత్తగా జవాబులు చెప్పి బుద్ధిమంతురాలి వనిపించుకోవాలి" అని.

ఇదీ అమ్మ, పెద్దమ్మల సంభాషణ సారాంశం. వాళ్లలో వాళ్లు మాట్లాడుకుంటున్నట్టుగా తనకు విషయం వివరించారు. ఎలా ప్రవర్తించాలో జాగ్రత్తలు చెప్పారని అర్థమైంది మాధవికి.

ఆ తరువాత మొదలైంది అసలు భయం, ఏదో చిరాకు. తెలియనివాళ్ల ముందు ఎలా కూర్చోవాలి? వాళ్లేం అడుగుతారు? ఏం జవాబులు ఎలా చెప్పాలి? లక్ష ప్రశ్నలు తలలో రైళ్లలా పరుగెత్తసాగాయి. అమ్మను చూస్తే ఆవిడ కూడా భయపడుతున్నట్టే కనిపిస్తోంది.

అవును మరి. తనలాగే అమ్మకూ, నాన్నకూ, కూడా ఇదే మొదటి పెళ్లిచూపులు కదా, అందుకే ధైర్యంగా ఉంటుందని పెద్దమ్మని, పెదనాన్నని పిలిపించారు.

తన ఆలోచనకు తనకే నవ్వొచ్చింది. వాళ్లకు మొదటి పెళ్లిచూపు లేమిటని. అయితే వాళ్లకీ ఇలాంటి అనుభవం ఇదే మొదటిసారి గదా అనుకుంది.

ఎవరివైపేనా చూడాలంటే సిగ్గుగా, మొగమాటంగా అనిపిస్తోంది. కంగారు వల్ల అన్నం సహించక తినలేకపోతుంటే "కడుపు నిండా అన్నం తిను. తీరా ఆ అబ్బాయి ముందు నీరసంతో కళ్లు తేలేశావంటే వాళ్లేమైనా అనుకోగలరు" అని పెద్దమ్మ హెచ్చరిస్తే అసలే ముద్ద గొంతు దిగలేదు.

సాయంకాలమైంది. అనుకున్న టైము వచ్చేసింది. వాళ్లూ వచ్చారు. ముందు పెద్దవాళ్ల మర్యాదలు, లాంఛనాలు అయాక పెద్దమ్మ రెక్కపట్టుకుని నడిపించి హాల్లోకి వేసుకుని వచ్చి కూర్చో బెట్టింది.

ఆచారం అని అలా పట్టుకుని తీసురాకుండా ఉంటే భయంతో కాళ్లు చచ్చుబడి కూలబడి పోయేదాన్నే అనుకుంది మాధవి. వాళ్లేదో అడిగారు. తను సమాధానాలు చెప్పింది. మధ్యలో ఒకసారి మాత్రం కళ్లెత్తి చూస్తే ఎదురుగుండా ఉన్న యువకుడు చిరునవ్వుతో తనవంకే చూడటం కనిపించింది. వెంటనే కళ్లు తిప్పుకుంది. 'బాగానే ఉన్నాడు' అని చెప్పింది ఆ క్షణంలో మనసు. లోపలికి వెళ్లవచ్చు ననగానే లేచివచ్చి, గదిలో మంచం మీద కూలబడ్డ కొన్ని క్షణాల దాకా బుర్ర పని చెయ్యలేదు.

గేటు దగ్గర మాటలు వినిపించాయి. వాళ్లు వెళ్లిపోతున్నట్టున్నారు. ఎవరూ తనను గమనించటంలేదని రూఢి చేసుకుని నెమ్మదిగా కిటికీ దగ్గరకు వెళ్లి తెర కొంచెం జరిపి చూసింది. ఎదురుగా గేటు దగ్గరగా అతను నిలబడి ఉన్నాడు. జేబులో చేతులు పెట్టుకుని నిలబడ్డ అతను పొడుగ్గా, అందంగా ఉన్నాడనే అనుకుంది. పెద్దవాళ్లు ఒకచోట చేరి ఏదో మాట్లాడుతున్నారు.

హఠాత్తుగా అతను ఇటువైపు చూశాడు. పక్కకు తిప్పుకునేంతలో అతను తనను గమనించడమే కాకుండా తనని చూసి నవ్వాడేమో అనే అనుమానం, దానితో పాటే సిగ్గూ ముంచుకొచ్చాయి. చప్పున తెర వదిలేసి వెనక్కి వచ్చి కూచుంది ఎవరైనా చూశారేమో అని గుండె గుబగుబ లాడింది.

తలుపు మీద చప్పుడవటంతో వర్తమానంలోకి వచ్చింది. తలుపు తీసి చూస్తే రూమ్‌బాయ్ నిలబడి ఉన్నాడు.

'మేడమ్! మీ టికెట్ వచ్చింది. ఏమైనా కావాలా?" అని అడిగి, టికెట్ చేతులో పెట్టాడు.

"ఏం వద్ద"ని చెప్పి అతన్ని పంపి తలుపు మూసి కూర్చున్నాక, మాధవి మనసు మళ్లీ గతంలోకి జారిపోయింది.

పెళ్లివాళ్లు వెళ్లిపోయాక మొదలయ్యాయి ఇంట్లో మంతనాలు. ఇద్దరు, ముగ్గురు ఒకచోట చేరి గుసగుసలు, చర్చలు సాగిస్తుంటే మాధవికి విసుగ్గా ఉంది. "నాతో ఏం చెప్పరేం, న న్నేమీ అడగరే, పెళ్ళి నాకా, వాళ్లకా?" అని చాటుగా కోప్పడింది. అయినా ఎవరూ తన ఉనికినే గుర్తించినట్టు లేదు.

వారం గడిచాక అమ్మ చెప్పింది. "ఆ అబ్బాయి ఉద్యోగం చేసే చోటు ఊరుగాని అడివి. అక్కడ ఒంటరి కాపురం చెయ్యాలి. ని న్నంత దూరం పంపటం మా కిష్టం లేదు. నువ్వింకా చిన్నదానివే. [illegible] చోటికి బదిలీ చేయించుకున్నా వేరే ఉద్యోగం చ[illegible] కున్నా బాగుంటుం దనుకున్నాం. వాళ్ల కా ఉద్[illegible] లేనట్టుంది. అందుకే జాతకాలు సప్పలదనో, ఏదో కారణం వాళ్లకు మామయ్యనే చెప్పెయ్యమని నాన్నగారు ఉత్తరం రాసేశారు".

మాధవి మనసు మూగగా మూలిగింది. "ఈ వారం మధ్యలో జరిగిన ఒక సంఘటన గురించి మీకు తెలియదు, కాని నా కతన్ని గురించి చాలా తెలుసు. అతన్ని చేసుకోవటం నా కిష్టమే" అని

చెప్పగల వయసు, ధైర్యం రెండూ మాధవికి లేవు. వారం నించి అనుక్షణం ఊహల్లో తేలిస్తున్న ఆ సంఘటన, అతని మాటలు మాధవి చెవులలో పదే పదే మారుమోగుతున్నాయి.

పెళ్లి చూపులైన మర్నాడు హఠాత్తుగా అతణ్ణి మాధవి కలుసుకోవటం తటస్థించింది. అదెలా జరిగిందంటే - మర్నాడు మధ్యాహ్నం ఏం తోచక కాలు గాలిన పిల్లిలా ఇంట్లో తిరుతూ ఉంటే "సినిమాకు పోదాం" అంటూ అరుణ వచ్చింది. బయటకు వెడితే కొంచెం టెన్షన్ అయినా తగ్గుతుందని, అమ్మతో చెప్పి, అరుణతో కలిసి బయటపడింది. మునుపటి రోజు సంఘటన వల్ల భవిష్యత్తును గురించిన ఆలోచనలు, ఆశలు ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే మాధవి మనసు వర్తమానం మీద అసలు లగ్నం కావటంలేదు. కొంచెం సేపైనా వేరే విషయాన్ని గురించి ఆలోచించుకోవాలంటే ఈ సినిమా ప్రోగ్రాం టానిక్‌లా పని చేస్తుందని అనుకుంటూ బయలుదేరింది.

"ఇంట్లో కూచుని కూచుని బోరు కొట్టేస్తోంది. అందుకే రమను, గిరిజను టికెట్లు కొనమని చెప్పి నేను నీ కోసం వచ్చాను. వాళ్లు దార్లో రమణిని కూడా కలుపుకుంటారు." కార్యక్రమం వివరించింది అరుణ.

ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ హాలు దగ్గరికి చేరేసరికి రమ, గిరిజ టికెట్లు కొని ఎదురుచూస్తున్నారు. సినిమా మొదలయ్యే వేళైంది అప్పటికే.

"వస్తే రమణి ఈ పాటికే రావాలి. రాదేమో! ఇంట్లో చుట్టా లున్నారంటూ నసుగుతూనే ఉంది." నెమ్మదిగా చెప్పింది గిరిజ.

"అయితే టికెట్ దండగేనా?" అరుణ వాపోయింది.

"దాన్ని నేను అమ్మేస్తాలే, భయపడకు." అభయం ఇచ్చింది. 'ఇంక లోపలికి వెళ్లిపోదాం' అని నిశ్చయించుకుని మాధవి, రమ చాక్లెట్లు తెస్తామని వెళ్లారు. వాళ్లు తిరిగి వచ్చేసరికి గిరిజ, అరుణ వాదులాడుకుంటున్నారు.

"గిరిజ ఆ టిక్కెట్ ఎవరో ఒక అబ్బాయికి అమ్మింది. అతను పక్కన చేరి అల్లరి చేస్తే?" అంటుంది అరుణ.

"మన దగ్గర ఒకే టికెట్ ఉన్నప్పుడు ఒంటరిగా వచ్చినవాళ్లే కొనుక్కుంటారు. దాని కోసం నే నొక తతగార్ని వెతకాలా ఇప్పుడు?" అని వాదిస్తుంది గిరిజ. "అతని పక్క సీట్లో నువ్వు కూర్చో, అంటే నువ్వు కూర్చో"మని వాదిస్తూంది గిరిజ.

"ఇంత దూరం వచ్చి మూడ్ పాడు చేసుకోవడం ఎందుకు? అత నేమైనా గొడవ చేస్తే కదా సమస్య? అప్పుడు చూసుకుందాం, పోదాం పదండి." రమ తీర్పు చెప్పి హాల్లోకి దారి తీసింది.


బ్యాటరీ వెలుగులో నలుగురూ సీట్ల దగ్గరికి చేరారు. ఒక చివర ఎవరో దంపతులు కూర్చుని ఉన్నారు. ముందుగా వచ్చిన రమ చటుక్కున ఆ పక్క సీట్లో కూర్చుంది. ఆ వెంటనే అరుణ, గిరిజ సర్దుకున్నారు. వెనకాల వచ్చిన మాధవికి నాలుగో సీట్లో కూర్చోక తప్పలేదు.

గిరిజ గుసగుసగా - "ప్లీజ్ ఎవరో ఒకరం ఆ సీట్లో కూర్చోవాలి కదా - నువ్వయితే ఏం, నేనైతే ఏం?" అంటూ బ్రతిమిలాడసాగింది.

ఆ చీకట్లో వాదానికి దిగితే చుట్టూ ఉన్నవాళ్లు తిడతారు. గొడ వెందుకని మాధవి ఊరుకుంది. టైటిల్స్ సగం అయాక పక్క సీట్లో వ్యక్తి వచ్చి కూర్చోవడం గమనించింది. గిరిజ వైపుగా వాలి కూర్చుని సినిమా చూడటంలో నిమగ్నమయ్యేందుకు ప్రయత్నించసాగింది.

ఇంటర్వెల్‌లో లైట్లు వెలిగాక అనాలోచితంగా పక్క సీటు వైపు చూసి ఉలిక్కిపడింది. ఏం చెయ్యాలో తోచక సీటుకి బల్లిలా అతుక్కుపోయింది. ఆ పక్క సీట్లో వ్యక్తి ఇంటికి వచ్చిన ఇంజనీరు.

"బయటకు వెడదాం వస్తావా?" చెవిలో గుసగుస లాడింది గిరిజ. లేవటం చేతకానిదానిలా బిగుసుకుపోయి, రానని తల మాత్రం




ఆడించింది. సగం ఖాళీ అయిన చాక్లెట్ పాకెట్, వాళ్ల పర్సులు అన్నీ మాధవి ఒళ్లో పడేసి వాళ్లు ముగ్గురూ లేచి బయటకు వెళ్లారు.

బతికాను అనుకోవాలా, చచ్చాను అనుకోవాలా అని ఆలోచిస్తూ వాళ్లు వెళ్లినవైపే చూస్తుండిపోయింది.

"సినిమా బావుందా?"

ఉలిక్కిపడి తిరిగి చూసింది. అతడు తననే అడుగుతున్నాడు చిరునవ్వుతో.

"ఊఁ" అని మాత్రం అనగలిగింది.

"మీరు నిజంగా సినిమా చూస్తున్నారా?"

తను శ్రద్ధగా సినిమా చూడటంలేదని అతను గమనించాడంటే అర్థం, అతను తననే చూస్తున్నాడన్న మాట. ఏం చెప్పాలో తెలియక తల వంచుకుని కూర్చుంది.

"నా గురించి మీరేం అనుకుంటున్నారో తెలియదు గాని, నిన్నటి నుంచి నేను మీ గురించే ఆలోచిస్తున్నాను."

దగ్గరగా తల వంచి చెప్తున్న అతని స్వరంలో ఆర్ద్రతకి ఆకులా వణికింది.

"నా గురించి మీ కంత తెలుసా?"

అతని ప్రశ్నకి తెలుసునని, తెలియదని ఎటూ కాకుండా తల ఊగించింది.

"నా పేరు అనంతకుమార్ - ఇంజనీర్ని. ఇంకా కొన్నాళ్లు డామ్ సైటులో ఉండాలి. అక్కడ మాకు కట్టిన కాలనీ, ఒక క్లబ్బు కాలక్షేపం కోసం తప్ప వేరే నాగరికత ఉండదు. ఓ మాదిరి పట్నానికి వెళ్లాలన్నా సినిమా చూడాలన్నా పది మైళ్లు వెళ్లాలి. మాకు అవసరానికి జీపులు, వ్యానులు ఉంటాయి. వాటిని వాడుకుంటాం, క్లబ్బులో వారానికి ఒక సినిమా వేస్తుంటారు."

"మరి మీరు భోజనం, సెలవలు వస్తే కాలక్షేపం ఎలా?" ప్రశ్న వేసింది గాని అనాగరికంగా, అనాలోచితంగా అడిగానుకుంటాడేమో అని భయపడింది మాధవి.

"ఒక మెస్ ఉంది. బ్రహ్మచారులం అక్కడే భోజనం అదే చేస్తాం. వాడు ఏ గడ్డి పెడితే అదీ గతి. ఇంక కాలక్షేపం అంటే పేకాట ఆడతాం, పుస్తకా లుంటాయి."

"డబ్బు పెట్టే పేకాడుతారా?" తనలోంచి అసంకల్పితంగా దూసుకొస్తున్న ప్రశ్నలకు మాధవికి చాలా ఆశ్చర్యం కలిగింది. వాళ్లేం చేస్తే తనకేం అని ఊరుకోకుండా తనకేదో సంబంధం ఉన్నట్టుగా ఎందుకు ప్రశ్నిస్తోందో తనకే తెలియటంలేదు.

"అది కాలక్షేపం, వ్యసనం కాదు. అంతకన్నా మంచి కంపెనీ దొరికితే పేకాట ఆడే అవసరమే ఉండదు."

"కంపెనీ" అన్న మాట ఏదైనా ప్రత్యేకార్థంతో అంటున్నాడేమోనని మాధవికి అనుమానం వచ్చింది. తలెత్తి చూస్తే అతను తననే చూస్తూ చిరునవ్వు నవ్వుతున్నాడు. చప్పున చూపులు మరల్చుకుంది. లైట్లారిపోయాయి.

"మీ స్నేహితురాళ్లు వచ్చేస్తారేమో. ఆలోచించండి, నాకు చాక్లెట్స్ ఇవ్వరా?" అతని చెయ్యి తనవేపు చాపటం చూసి గాభరాగా రెండు చాక్లెట్లు అతని చేతిలో పెట్టింది.


"థ్యాంక్యూ, వెరీ స్వీట్."

ఏ ఉద్దేశంతో అలా అన్నాడో అనే అనుమానం వచ్చింది. అతని కంఠ స్వరంలోని చిలిపితనానికి

ఆమె ఒళ్ళు జల్లుమంది.

ఇంక ఆ తరువాత మాధవి సినిమా చూడలేకపోయింది. – అలా అని పక్కకీ చూడలేకపోయింది ధైర్యం చేసి. ఇంటికి వచ్చాక కూడా అతని మంద్రమైన స్వరం, మాటలే చెవుల్లో ప్రతిధ్వనించసాగాయి. ఇప్పుడు మనసులో నిరాసక్తతను కలిగిన నిరాశను అణచుకోడానికి, దాచుకోడానికి మాధవి వద్ద బాధ ఏ భావకూ లొంగేదికాదు.

ఆ తరువాత ఆమె ప్రమేయం ఏమీ లేకుండానే కొన్ని నెలలకు ఆమె వివాహం నిశ్చయమైంది. అతడు కూడా ఇంజనీరు. కాంట్రాక్టులు చేస్తూ బాగా ఆర్జిస్తున్న లక్షణమైన పెళ్లికొడుకుగా, ఆ ఊళ్లోనే ఉండే సంబంధంగా అందరికీ ఎంతో నచ్చాడు. మాధవి అదృష్టవంతు రాలన్నారు అందరూ.




మాధవిలో ఏ మాత్రం ఉత్సాహం, చలనం కలగలేదు. ఎవరో అలంకరించడం, కాస్త రంగు తక్కువైనా లక్ష్మి కళ గల పెళ్లికూతురు అని ప్రశంస పొందటం తప్ప మాధవి ప్రమేయం ఏమీ లేకుండా వైభవంగా పెళ్లయిపోయింది. పెద్దలంతా పెళ్లి కొడుకు గుణగణాలను, వారి సామర్థ్యాన్ని చెప్పుకుంటూ మురిసిపోయారు. మాధవిని కొత్త కాపురానికి పంపారు అన్ని లాంఛనాలతోటే.

కొత్త సంసారంలో - నిద్ర లేవటం, పనివాళ్లకు పనులు చెప్పటం, బ్రేక్‌ఫాస్ట్, ఫోన్ కాల్స్ అందుకోవటం, భర్త ఆఫీసుకో, సైటు మీదకో వెళ్లేదాకా అతని అవసరాలు చూడటం, అతడు వెళ్లాక తన పనులు చేసుకోవటం, లంచ్, భర్త రెస్ట్ తీసుకుంటున్నప్పుడు ఏవేవో పుస్తకం చదవటమో, తను కూడా పడుకోవటమో చెయ్యటం. సాయంత్రం అతడు ఎటైనా తీసుకువెడితే వెళ్లటం, అతడు క్లబ్‌కు వెడితే తన కాలక్షేపం తను వెతుక్కోవటం, రాత్రి డిన్నర్, నిద్ర - ఇది దిన చర్య. ఈ దినచర్య ఒక ఆర్నెల్లు కొత్తగా అనిపించినా, రానురాను మరి జీవితం చట్రంలో బిగించినట్టుగా ఉండేది. నేను కూడా ఒక యంత్రాన్నా అనే అనుమానం మాధవికి రాసాగింది. నెలకొకసారైనా సరదాగా ఇద్దరూ కూర్చొని కబుర్లు చెప్పుకోవడం గాని, తనకేది ఇష్టమో అతడు అడగటం, అది చెయ్యటం గాని జరగలేదని సంవత్సరం గడిచాక మాధవికి తోచింది.

ఒకటి రెండుసార్లు తన ఇష్టాలను చెప్పే ప్రయత్నం చేసినప్పుడు అది డబ్బుకు సంబంధించినదైతే నీ కెంత కావాలో అంత తీసుకో, కారు డ్రైవరుతో పంపిస్తాను తెచ్చుకొమనే, డబ్బుతో ప్రమేయం లేనిదైతే, నాకు టైము లేదనో అనేవాడు. అలాగే రెండో సంవత్సరం కూడా గడిచిపోతుంటే, "జీవితమంతా ఇలాగే గడుస్తుందంటే ఇంకొన్నాళ్లలో నాకు పిచ్చెక్కడం ఖాయం" అనిపించసాగింది. అలాంటి పరిస్థితి రాకుండా ఉండాలంటే తనకంటూ కాలక్షేపం, ఒక జీవితం ఏర్పరచుకోవాలనే నిర్ణయానికి వచ్చింది.

అందుకే తీరికగా ఉన్నప్పుడు భర్తతో "నేను ఎం. ఏ. చదువుతా"నని అంది.

కొంచెంసేపు ఊరుకుండి, "నీకు చదువుకోవాలని ఉంటే చదువుకో, నువ్వు ఉద్యోగం చెయ్యటం నా కిష్టం లేదు. ఆ అవసరమూ లేదు" అన్నాడు.

మాధవికి మొహం మీద నీళ్లు చల్లినట్టయింది. ఉత్సాహమంతా నీరుగారిపోయింది. ఆ ప్రయత్నం విరమించుకుంది.

మరొక ఆర్నెల్లకు అనుకోని అఘాతం తగిలింది. ఒక ప్రమాదంలో ఆమె భర్త మరణించాడు. అమ్మ, నాన్న బంధుజనం అంతా గుండెలు బాదుకున్నారు.

"నీ జీవితం ఎంతలో తెల్లారిపోయిందే!" అని పట్టుకుని ఏడ్చారు.

తను గడుపుతున్న జీవితం ఎలాంటిదో, దానికి కలిగిన నష్టం ఎంతటిదో ఆలోచించే శక్తి కూడా లేకుండా స్థాణువైపోయింది మాధవి. పెద్దలంతా చేరి వ్యవహారాలు నిర్వహించారు. అత్తమామలకు ఏదైనా ఇస్తే బాగుంటుం దన్నారు. క్యాష్‌లో సగం ఇవ్వమంది. "ఇంకా నీది చిన్న వయసు, నీకే డబ్బు అవసరం, వాళ్లకు సగం అవసరం లేదు ఎంతో కొంత ఇచ్చెయ్యి"మని మామయ్య సలహా ఇవ్వబోతే తను వినలేదు.

"నీ ఖర్మం, . తెలివి తక్కువగా ప్రవర్తిస్తున్నా"వని విసుక్కున్నారు. హెచ్చరికలు చేశారు.

తను ఏదీ పట్టించుకోలేదు. ఎవరి సలహాలు వినదలుచుకోలేదు. ఇల్లు తనకే ఉంచుకుంది.

"ఒంటరిగా ఉండొద్దు - మాతో వచ్చెయ్యి. ఇల్లు అద్దెకిచ్చేస్తే నీకు అవసరానికి చేతిలో డబ్బుంటుంది" అన్నారు అమ్మా, నాన్న

ఎందుకో ఎవరి మాటా వినాలని అనిపించలేదు. ఇక ముందు తన జీవితాన్ని తనే ఏర్పరచుకోవాలని, తనకు సంబంధించిన ఏ నిర్ణయమైనా తనే చేసుకోవాలనే దృఢ నిశ్చయానికి వచ్చింది. అందర్నీ ఎన్నో ప్రశ్నలు అడగాలని అప్పుడప్పుడు ఆవేశం వచ్చినా అణుచుకుంది. కొన్నాళ్లు తన ఇంట్లోనే ఉంటానని పట్టుబట్టింది. ఎవరూ తన నిర్ణయాన్ని మార్చలేక విసుక్కుని హెచ్చరికలు చేస్తూ ఎవరి దారిన వాళ్లు వెళ్ళిపోయారు.

కూర్చుని తింటుంటే నిష్ప్రయోజనంగా జీవితం వృథా చేసుకోవడమే అవుతుందని తోచింది. ఎం. ఏ. చదవాలన్నా ఆసక్తి మొగ్గలోనే మాడిపోయింది. కాలక్షేపమైనా, మార్పు కోసమైనా ఏదో చెయ్యాలనే తపనతో కాంపిటీటివ్ పరీక్షలు రాయాలని నిశ్చయించుకుంది. బ్యాంక్ పరీక్షలకు చదవటం ప్రారంభించింది. పరీక్ష పాసై ఆఫీసరుగా ఉద్యోగానికి ఆర్డరు వచ్చేదాకా ఎవరికీ చెప్పలేదు.

ఉద్యోగం వచ్చిందని చెప్పగానే, "నీకు ఉద్యోగం చేసే కర్మం ఏమిటి" అన్నారు అమ్మ, నాన్నగారు.

"ఇలాగే ఉద్యోగం చేసుకుంటూ ఎన్నాళ్ళుంటావు? ఇంకా చిన్న వయసులోనే ఉన్నావు. మళ్లీ పెళ్లి చేసుకో"మని ప్రోత్సహించారు కొందరు.

పెళ్లి మీద ఎలాంటి నమ్మకం, ఉత్సాహం లేకుండాపోయాయి. తన జీవితం తన ఇష్టప్రకారం స్వతంత్రంగా దిద్దుకోవాలని తీర్మానించుకుంది. ఎదుటివా రెవరైనా సరే ఎంతవరకు దగ్గరకు చేరనివ్వాలో అంతవరకే చేర్చేది. తన వ్యక్తిగత జీవితంలోకి ఎవరూ రాకుండా తనే ఒక హద్దు ఏర్పరచుకుంది. అలా అయిదు సంవత్సరాలు గడిచిపోయాయి.

బావగారి కొడుకుని పెంచుకుంటే అనరాగా ఉంటాడని పరోక్షంగా రాయబారాలు నడుపసాగారు కొందరు. ఆ రాయబారాలు మాధవిలో కొత్త ఆలోచనలు రేకెత్తించాయి. ఎవరి సలహా సంప్రదింపులు లేకుండా ఒక అనాథాశ్రమం నుంచి ఒక సంవత్సరం ఒక ఆడపిల్లను, తరువాత సంవత్సరం మరొక మగ పిల్లవాణ్ణి - నెలలు నిండని పిల్లలను చట్టబద్ధంగా దత్తత చేసుకుని తెచ్చుకుంది.

ఈ తన చర్యకు ప్రతిఘటనలు, చర్చలు, బెదిరింపులు చాలానే ఎదుర్కోవలసి వచ్చింది. అన్నిటినీ ధైర్యంగా తిరస్కరించింది. ఒంటరిగా

పోరాడి గెలిచింది. పిల్లలిద్దరూ త్వరగానే తనను తల్లిని చేసేసుకున్నారు. తన జీవితానికి అర్థం, పరమార్థం ఏర్పడినట్టుగా భావించుకుంది.

ఇప్పుడు పిల్లలిద్దరూ బుద్ధిగా చదువుకుంటున్నారు. ఈ ఊరికి బ్యాంక్ పని మీద వచ్చింది. పిల్లలిద్దరూ స్కూల్ నించి ఎక్స్‌కర్షన్‌కి వెళ్లారు. ఇంటికి వెళ్లి చేసేదేమీ లేదు కదా అని, ఈ చుట్టు పక్కల చూడవలసిన ప్రదేశాలున్నాయని చెప్తే పనయిపోయాక మూడు రోజుల నుంచి అన్నీ చూస్తోంది. రేపు తను వెళ్లిపోతుంది.

ఈ రోజు హఠాత్తుగా ఇలా జరుగుతుందని గాని, ఇన్నేళ్ల తరువాత కూడా తామిద్దరూ ఒకరినొకరు గుర్తుంచుకోగలరని గాని అనుకోలేదు. మనసు లోపలి పొరల్లో ఎక్కడో అతన్ని గురించిన జ్ఞాపకాలు, ఆనాటి అశక్తత వలన కలిగిన నిరాశ తాలూకు గుర్తులు ఉన్నట్టు అతన్ని చూడగానే స్ఫురించినా ఆ ఆలోచనాలను అక్కడే తుంచివేసేది. అవన్నీ ఇవాళ అతన్ని చూడగానే ఇలా పైకి తన్నుకువస్తాయని, మనసులో ఇంత కల్లోలం చేస్తాయని ఊహించలేకపోయింది.

ఇప్పుడేం చెయ్యాలి? అత నెవరు? త నెవరు? పక్కనున్న స్త్రీ అతని భార్య కాబోలు, తన మనస్సులో అవాంఛనీయమైన భావం ఏదైనా ఉందా అని ఆత్మవిమర్శ చేసుకుంది. కేవలం కుతూహలం తప్ప తనలో మరో భావం లేదని స్పష్టంగా తెలిశాక మాధవి మనసు తేలికైంది.

'రేపు తను ఇక్కడ నుంచి వెళ్లిపోతుంది. ఈ క్షణం కేవలం తాత్కాలికమే అనుకున్నాక నిశ్చితంగా ఊపిరి పీల్చుకుంది.


రాత్రి డిన్నర్‌కి డైనింగ్ హాల్‌కు వెళ్లాలా, రూమ్‌లోకే తెప్పించుకోవాలా అని కాసేపు తనలో తనే తర్కించుకుంది. వెళ్లాలని, వెళ్లి వాళ్లు మళ్లీ కనిపిస్తే చూడాలనీ ఉంది. మళ్లీ ఏదో అఇడిగానూ ఉందేమో అన్న అనుమానం కూడా కలగసాగింది. తన మనసులో అసూయగాని, మ రే వికారం కాని లేనప్పుడు వెళ్లటానికి, వాళ్లని చూడటానికి జంకెందుకని తననే ప్రశ్నించుకుంది. కొంతసేపు తర్జన భర్జన పడ్డాక వెళ్లాలనే నిశ్చయించుకుంది.

ఎవరో తలుపు తట్టిన చప్పుడైంది. "నా ఆలోచనలో మునిగిపోయి నేను వినలేదా? ఎవరో ఎంతసేపటి నుంచి పిలుస్తున్నారో" అనుకుంటూ చివాలున వెళ్లి తలుపు తీసి ఎదురుగా నిలబడ్డ వ్యక్తిని చూడగానే అరక్షణం కలవరపడింది. వెంటనే సర్దుకుని లోపలికి దారి తీస్తూ "రండి" అనే లోపుగానే, ఆ వ్యక్తి "లోపలికి రావచ్చా?" అని చాలా మర్యాదగా అడిగింది.

పక్కకు తప్పుకుని "రండి" అంటూ ఆహ్వానించింది.

ఆమె లోపలికి వచ్చి తలుపు దగ్గరగా వేసి వచ్చి ఎదురుగా కూర్చుంది.

ఏమని మాట్లాడాలో, అసలు ఆమె తన రూమ్‌కు ఎందుకు వచ్చిందో మాధవికి అంతుబట్టలేదు. ఆమె కూడా మాట్లాడటానికి సంకోచిస్తుందేమో అని అనిపించింది. కొద్ది క్షణాలు మౌనంగా దొర్లిపోయాయి. చివరికి మాధవి తనే ముందుగా "మీరు..." అంటూ అర్ధోక్తిలో ఆపి ఆమెవైపు చూసింది.




అందుకోనమే ఎదురు చూస్తున్నదానిలా ఆమె వెంటనే అందుకుంది. "నా పేరు ప్రమీల. ఈ ఊళ్లో బంధువుల పెళ్లికని వచ్చాం. ఇందాక లిఫ్ట్‌లో మిమ్మల్ని చూడగానే మీరు మాధవిగారని గుర్తు పట్టాను. మీతో మాట్లాడా లనిపించింది. చొరవ తీసుకుని వచ్చినందుకు క్షమించండి."

ఆమె మాటలు వింటున్న మాధవికి అంతే అయోమయంగా తోచింది. ఈమె అనంత్‌కుమార్ భార్య కావాలి. తను చూసినదాన్ని బట్టి అలాగే అనుకుంది. ఆమె తనతో ఏం మాట్లాడాలి? తన పేరు, వివరాలు ఆమె కెలా తెలుసు? లక్ష ప్రశ్నలు మెదిలాయి. తనను తను సంబాళించుకుని "నేను మీకెలా తెలుసు? ఇదివరకు మిమ్మల్ని ఎప్పుడూ కలిసినట్లు, చూసినట్లు నాకు జ్ఞాపకం లేదు" అంది.

"నన్ను మీరెప్పుడూ చూడలేదు. నే నెవరో మీకు తెలియదేమోనని కూడా నే ననుకుంటున్నాను. నేను అనంత్‌కుమార్ గారి భార్యను. నా జీవితంలో ఎప్పుడైనా మిమ్మల్ని ఒకసారి కలవగలిగితే అని అనుకుంటుండేదాన్ని చాలా సంవత్సరాలు. ఆ అవకాశం ఇప్పుడు ఇలా కలిసి వచ్చింది."

సమాధానం చెప్పేందుకు ఏమీ లేక వింటూ కూర్చుంది మాధవి.

"నిజానికి మిమ్మల్ని చూడాలి అనే కుతూహలం వల్ల ఇలా వచ్చేశానే గాని, మీతో ఏం మాట్లాడాలో నాకూ తెలియటంలేదు." కొంచెం ఇబ్బందిగా నవ్వింది.

"నన్ను చూడాలనే కుతూహలం మీ కెందుకు కలిగింది? నే నెలా తెలుసు మీకు?" తనలో కూడా పెరుగుతున్న ఆత్రతను కప్పిపుచ్చుకుంటూ ప్రశ్నించింది.

"నేను మీకు జవాబు చెప్పాలంటే చాలా పాత విషయాలు జ్ఞాపకం చెయ్యాలి. అవి వినడానికి మీకు ఇష్టం ఉంటుందో, ఉండదో కూడా నాకు తెలియదు. వాటి వలన మీకు ఇబ్బంది కలిగినా కలగవచ్చు. నిజానికి అవేవీ మీకు తెలియకపోయినా మనకు వచ్చే నష్టం ఏమీలేదు. మిమ్మల్ని చూడాలనుకున్నాను. చూశాను. మీ గురించి చెప్తే తెలుసుకుని వెళ్లిపోతాను." సాధ్యమైనంతగా మామూలుగా మాట్లాడాలని ప్రయత్నిస్తోందామె.

"నా గురించి తెలుసుకుంటే మీకేం వస్తుంది? ఆ అవసరం ఏమిటి?" ఈ మాటు తన ఆశ్చర్యాన్ని దాచుకోలేక ప్రశ్నించింది మాధవి.

ఆమె చిరునవ్వుతో - "అవసరం ఏమీ లేదు. కేవలం కుతూహలం మాత్రమే. ఇద్దరు అపరిచితులం కలుసుకున్నాం. ఒకర్ని గురించి ఒకరం తెలుసుకుందాం అంతే" అంది.

ఆమె ఉద్దేశం ఏమిటో మాధవికి అర్థం కాలేదు. తనేమీ చెప్పనన్నా వెళ్ళిపోవడానికి సిద్ధపడే వచ్చినట్లుంది. ఇప్పుడి లా ఆమె ఎందుకు వచ్చిందో, తనని గురించి తెలుసుకున్నాక ఆమె ఏం చెప్తుందో తెలుసుకోవాలనే ఆరాటం మాధవిలో కలిగింది. అన్నిటి కన్నా ముఖ్యంగా తనకి తెలియవలసింది అనంత్‌కుమార్ భార్య తనను గురించి తెలుసుకుని ఏం చేస్తుంది అన్న విషయం! అందుకే ఆమెతో సంభాషణ పొడిగించాలనే నిశ్చయించుకుంది.

"ఇద్దరం అపరిచితులం కాదేమో! నే నెవరో, నా పేరు మీకు తెలుసు" అంటూ, "నా గురించి చెప్పడానికేముంది? బాంక్ ఆఫీసరుగా పని చేస్తున్నాను. పని మీద ఇక్కడికి వచ్చాను. నా పిల్లలిద్దరూ చదువుకుంటున్నారు. నా భర్త యాక్సిడెంట్‌లో పోయారు." ఇంకేమీ చెప్పేందుకు లేదన్నట్టుగా ముగించింది. భర్త పోయాడని చెప్పినప్పుడు ఆమె ముఖంలో కదలాడిన భావాన్ని మాధవి స్పష్టంగా చూడగలిగింది. ఇద్దరి మధ్యా మౌనం నిలిచింది కొద్దిసేపు.

హొటల్ బాయ్ కాఫీ తెచ్చి పెట్టాడు. అది కప్పులో పోసి ఆమె చేతికిస్తూ, "మీ గురించి చెప్పండి. మీకు నే నెలా తెలుసో తెలుసుకోవాలని ఉంది" అంది.

"ఫోటోలో చూశాను. మా వారి బీరువాలో మీ ఫోటో చాలా కాలంగా ఉండేది. మా అత్తగారు వాళ్లు మీ గురించి మాట్లాడుకుంటుంటే విన్నాను."

ఆశ్చర్యంతో కళ్లప్పగించి వింటూ ఉండిపోయింది మాధవి. పెళ్లి చూపులకు ముందే తన ఫోటో వాళ్లకు పంపారన్నది ఇన్నేళ్ల తరువాత తెలిసిన విషయం. తన భర్త బీరువాలో మరొక స్త్రీ ఫోటో ఉందనే విషయాన్ని ఈవిడ ఇంత మామూలుగా ఎలా చెప్పగలుగుతూందో మాధవికి అర్థం కాలేదు.

రకరకాల ఆలోచనలతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న మాధవినే చూస్తూ ఆవిడే మాట్లాడసాగింది. "మిమ్మల్ని పెళ్లి చేసుకోవాలని ఆయనకు చాలా ఇష్టంగా ఉండేదని, ఆయన తల్లిదండ్రులు కూడా మీ సంబంధం నచ్చిందనీ, మీ వాళ్లే సంబంధం వద్దనే సరికి పెద్దవాళ్లు చాలా నొచ్చుకున్నారని నా పెళ్లయిన కొద్ది రోజులకే నాకు తెలిసింది."

"మీకు కోపం రాలేదా? బాధ కలగలేదా?" అసంకల్పితంగా అడిగింది.

ఆమె ముఖంలో ప్రశాంతమైన నవ్వు వెలిగింది. "చిన్నతనం కదా! అప్పుడు చాలా బాధ కలిగింది. బాధ కన్నా రోషం అనే చెప్పాలి అప్పటి స్థితిని. మరో స్త్రీ ఫోటోని ఆయన అంత భద్రంగా దాచుకున్నారని తెలిసినప్పటి నా పరిస్థితి వర్ణనాతీతం. నాలో నేను ఎన్నిసార్లు ఏడ్చానో చెప్పలేను."

"మీవారిని అడగలేదా ఎప్పుడూ?"

"కొత్తలో సంకోచంతో అడగలేకపోయాను. ఎలా అడగాలో కూడా తెలియలేదు. కొన్నాళ్లకు ధైర్యం చేసి ఎవరి మీదో అంత ఇష్టం ఉంచుకుని, ఫోటోలు దాచుకుంటూ నన్నెందుకు చేసుకున్నారని అడిగాను. ఆయన చెప్పిన సమాధానం నా కప్పుడు అర్థం కాలేదు గాని వయస్సు గడుస్తున్న కొద్దీ అర్థమైంది.

"ఏం జవాబు చెప్పారు?" మాధవిలో ఉత్కంఠ పెరిగింది.

"ఆ అమ్మాయిని చేసుకోవాలని నేను చాలా ఇష్టపడ్డ మాట నిజం. ఆ ఇష్టంతోనే ఆమె ఫోటోను భద్రంగా పెట్టుకున్నాను. అది పారెయ్యాలంటే నాకు చేతులు రావు. అలా అని నువ్వంటే నాకు అనిష్టం అని అనుకోకు. నీ పట్ల నా మనసులో ఉన్న భావానికి సరైన అర్థం చెప్పటానికి కొంచెం టైము పడుతుంది. నువ్వు నన్ను నమ్మి కొంచెం ఓపిక పడితే ఇద్దరం సుఖంగా ఉండవచ్చు" అన్నా రాయన.

"అప్పట్లో ఆయన మాటలు పూర్తిగా బోధపడకపోయినా ఓపిక పట్టాలని అన్నారు కనుక అలాగే చేద్దామనుకున్నాను. మా మధ్య ఈ రోజు వరకు ఇన్నేళ్లలో మళ్లీ ఆ ప్రసక్తి రాలేదు. ఇవాళ మీరు కనిపించాకే నాకు మీతో మాట్లాడా లనిపించింది. మీ కభ్యంతరం లేకపోతే ఇలా ఎందుకు జరిగిందో తెలుసుకోవాలని ఉంది నాకు." మాధవివైపే చూస్తూ సందేహంగా అడిగింది.

"నాకూ తెలియదు. జాతకా లేవో కలవలేదని అనుకున్నా రన్నట్టు గుర్తు." మాధవి తడబడకుండా జవాబు చెప్పింది.

"అంతగా జాతకాలు నమ్మేవా రయితే మీ వివాహం విషయంలో పొరబడలేదా?" తనలో తనే అనుకుంటున్నట్టుగా అంది.

"ఏమో? ఏమైనా ఇప్పుడివన్నీ మాట్లాడుకోవటం అసందర్భం, అనవసరం అనిపించటంలేదూ? ఈ కారణంగా మీ జీవితంలో ఏదైనా అసంతృప్తి ఉంటే..." ఆపైన ఏమనాలో తెలియక అర్థోక్తిలో ఆపేసింది.

"అసంతృప్తి అనేది చాలా ఏళ్ల క్రితమే పోయింది." వెంటనే జవాబు చెప్పింది.

"మరి మీవారు..." అడగవలసిన విషయం ఏమిటో అర్థం కాక ఆపేసింది.

"అహఁ... ఆయన వంటి భర్త దొరకటం నా అదృష్టం. కొన్నేళ్ల దాకా నేను ఆ ఫోటో విషయం మరిచిపోవాలని ప్రయత్నించాను. తరువా తెప్పుడో చూస్తే అది ఉండే చోట లేదు. ఇవాళ మిమ్మల్ని లిఫ్టులో చూశాకే ఈ మాట పైకి వచ్చింది. మిమ్మల్ని గుర్తు పట్టారా అని ఆయన్ని అడిగాను. ఇన్నేళ్ల తరువాత చూస్తే ఏ మనిపించిందని అడిగాను."

"ఇన్నేళ్ల తరువాత ఏమిటా పిచ్చి ప్రశ్నలు అన్నారు. టికెట్లు కొనడానికి వెళ్లారు. రావటం లేటవుతుంది. ఈలోగా మిమ్మ ల్నొకసారి కలుద్దామని నే నిటు వచ్చాను".

"నా కాయన జ్ఞాపకం ఉంటారని మీ రెందు కనుకున్నారు?" ప్రశ్నించకుండా ఉండలేకపోయింది.

"లిఫ్టులో మీరు ఆయన్ని చూడగానే ఆశ్చర్యపోయారు. అందుకే అలా అనుకుని వచ్చాను." కుర్చీలో ఇబ్బందిగా కదిలింది.

కొద్ది క్షణాలు మౌనంగా గడిచిపోయాయి.

"ఇంక వెళ్లివస్తాను. చాలా థాంక్స్" అంటూ లేచింది.

మాధవి అనుసరించింది.

"జీవితంలో ఎప్పుడైనా ఒకసారి మిమ్మల్ని కలవాలని నా కోరిక. అది ఇవాళ ఇలా సంభవించింది. సమయం వృథా చేశానేమో!" గుమ్మం దగ్గర ఆగి అంది.

"అదేం లేదు. కాని నే నెప్పుడూ ఇలాంటి సన్నివేశాన్ని ఊహించలేదు. జీవితం అంటే ఎన్నో సంఘటనల, అనుభవాల కలయికే అని అంటారు. వాటిని అనుభవించటమే మన కర్తవ్యం అనుకుంటూ ఉంటాను నేను."

"నిజం చెప్పారు. అంతేనేమో!" నమస్కరించి, సెలవు తీసుకుని తన రూమ్ వైపు వెళ్లిపోయింది ప్రమీల.

తలుపు మూసి వచ్చి మంచం మీద వాలిపోయిన మాధవి, "నిజం చెప్పలేదు, ప్రమీలా నీకు! బహుశ నీ భర్త కూడా నిజం చెప్పలేదేమో! మా ఇద్దరిలో గతం బలమైన ముద్ర వేసుకుందని ఇన్నేళ్ల తరువాత తెలిసింది. అంతేకాదు, ఇంకో నిజం కూడా నీకు నేను చెప్పలేదు. అది నీకే కాదు, ఎవ్వరికీ చెప్పలేనిది. ఇన్ని సంవత్సరాలు గడిచిపోయినా ఒక పురుషుడి మనసులో నా కొక ప్రత్యేకమైన గుర్తింపు ఉందని తెలిసిన నా స్త్రీ హృదయం గర్వంతో ఉప్పొంగిపోతోంది. ఇది నా జీవితంలోనే అపురూపమైన సంఘటన! అనుకుంది.

★

